

# పెళ్ళైనబ్బాయి
# కాళ్ళైనబ్బాయి

సి.యస్.ఆర్.లక్ష్మీప్రసాద్

రంగయ్యగారిల్లు హడావుడిగా వుంది. కారణం మరేంలేదు. వారి రెండో అమ్మాయిని చూడటానికి మగపెళ్ళివారు వస్తున్నారు.

రంగయ్యగారి పెద్దమ్మాయి ముత్యం, అల్లుడు సీతారామారావు ఆ వుదయమే పెద్దాపురంనుంచి దిగారు. రెండోపిల్ల కనకం పెళ్ళి కుదరగానే, పదిరోజుల్లో ముహూర్తాలు పెట్టించేసి పెళ్ళి చేయాలని రంగయ్యగారి తాపత్రయం. ఆయన సతీమణికి యీ సంబంధం చాలా నచ్చింది. ఈ పెళ్ళి కుదురుతుందని సోదిలోకి వచ్చి వాళ్ళమ్మమ్మ చెప్పిందికూడాను.

అందుకే పెద్దకూతుర్నీ, అల్లుడ్నీ పిలిపించమని భర్తతో పోరు పెట్టింది, పెళ్ళయేవరకూ యిద్దరూ యిక్కడే వుంటారని.

రంగయ్యగారి యింటిముందు కారు

ఆగింది. పెళ్ళికొడుకు తల్లిదండ్రులతో సహా వచ్చేశాడు.

వారింట్లో హడావుడి స్థాయి పెరిగిపోయింది. పెళ్ళికొడుకు తన స్థానాన్ని అలంకరించాడు. ఫలహారాలు, కాఫీలు అయిపోయాయి. పెళ్ళిచూపుల తతంగం పూర్తయింది.

కిటికీ సందుల్లోంచి, కర్టెన్ల చాటునుంచి, గోడ ప్రక్కనుంచి అమ్మలక్కలు, పెళ్ళికావలసిన పిల్లలు తొంగి తొంగి చూస్తూ, గుసగుసలాడసాగారు.

"పెళ్ళికొడుకు బాగా పొడుగేనే!"

"ఉడిపి హోటల్లో యిడ్లీలా వున్నాడులే."

"బాగానే వున్నాడుకాని, కొంచెం నలుపు కదూ!"

"బాగా వున్నవాళ్ళేనట!"

"కట్నం ఎంతలో వున్నారో! మొన్న మా బాబాయికూతురికి నలభై వేలు రొఖ్ఖం పదెకరాలమాగాణి యిచ్చాం."

"పాతిక, ముప్ఫయి మధ్యలో వున్నారట!"

పిల్లవాడికి పిల్లా, పిల్లకి పిల్లవాడూ నచ్చారు. కట్నం విషయం – ఏమీ తేలలేదు. రంగయ్యగారు పాతికకు మించనని పెద్దల్లుడితో చెప్పేశాడు. పిల్లవాడితండ్రి ముప్ఫైకి తగ్గనని అంటున్నాడు.

"వెళ్ళి ఉత్తరం వ్రాస్తామండీ!" అన్నాడు పెళ్ళికుమారుడి తండ్రి బింకంగా.

పెళ్ళివారు వెళ్ళిపోయారు. ఇంట్లో సందడికూడా చప్పబడింది. వాన వెలిసిన తర్వాత వున్నంత చల్లగా వుంది రంగయ్యగారిల్లు.

ఆ సాయంత్రం ఎదరింటి ముకుంద రావుగారు పిచ్చాపాటి మాట్లాడుతూ "మీ యింటికి పెళ్ళివారొచ్చారనుకుంటాను." అన్నాడు.

"అవునండీ! వారిది విజయవాడ." అన్నాడు రంగయ్యగారు.

"విజయవాడా! అయితే నాకు తెలిసేవుంటారు. నేను అక్కడ పదేళ్ళు ఉన్నాను సుమా!" అన్నాడు ముకుంద రావు నవ్వుతూ.

"అంబాసిడర్ హోటల్ ప్రొప్రయిటర్ లింగమూర్తిగారి అబ్బాయి."

"ఓ.. వారా? నాకు తెలియకేం! బాగా తెలుసు. వారికి ఒక్కడే అబ్బాయి— మంచివాడే; కాని డబ్బు జాగ్రత్తలేని మనిషి. దుబారా మనిషట." అన్నాడు ముకుందరావు.

రంగయ్య గుండెల్లో రాయి పడినట్లయింది. పెద్దమ్మాయిని యివ్వటంలోనే పొరపాటుపడి దుబారామనిషికి అంటగట్టాడు.

'ఈసారి యిటువంటి పొరపాటు చెయ్యదల్చుకోలేదు. డబ్బు జాగ్రత్తలేని




మనిషిదగ్గర డబ్బు ఎంతకాలం వుంటుంది. ఆతర్వాత అమ్మాయిగతి ఏమౌతుంది. పెద్దమ్మాయి కూటికీ, గుడ్డకీ ముఖం వాయటంలేదూ !' అనుకున్నాడు.

మర్నాడే విజయవాడ ప్రయాణం కట్టాడు. టాక్సీ వేసుకొని హోటల్ అంబాసిడర్‌కు వెళ్ళాడు.

కౌంటర్‌లో పెళ్ళికొడుకు ఆనందరావు కూర్చునున్నాడు. మామగారిని చూసి నమస్కారం చేసి "బాగున్నారా?" అన్నాడు.

రంగయ్యగారు ముచ్చటపడిపోయి 'కుర్రాడు మర్యాదస్తుడే' అనుకున్నాడు.

"ఒకగది కావాలి నాయనా ! పనుండి వచ్చాను. ఇదివరకంతా ఎక్కడెక్కడి హోటళ్ళలోనో వుండేవాడిని. ఇప్పుడు మనహోటల్ వుందికదా ! యిక్కడికే వచ్చాను," అన్నాడు ఆప్యాయంగా.

"అవునుమరి..." అని నవ్వి ... ఒరేయ్ ! బోయ్; వీరికి తొమ్మిదో నంబరురూమ్ చూపించు," అని రిజిష్టరు తెరిచి ఏవేవో వ్రాసి "సంతకం చెయ్యం" డన్నాడు.

రంగయ్యగారు సంతకం చేసి వెళ్ళబోతుంటే "సార్ ! పాతిక రూపాయలు అడ్వాన్సు !" అన్నాడు ఆనందరావు.

రంగయ్యగారు ఒక్కక్షణం నివ్వెర

బోయి, తెల్లబోయి, తర్వాత తెప్పరిల్లాడు. ఏడవలేక నవ్వుతూ డబ్బుయిచ్చి గదివేపు కదిలాడు.

రంగయ్యగారు రెండురోజు లుండి, ఆనందరావుగురించి వాకబు చేశాడు. ఎవరిని అడిగినా మంచివాడేనని చెప్పారు. కొందరు వ్యాపారస్థులు 'అబ్బాయి ఘటికుడు. అతనికి పైసపైస లెక్క!' అన్నారు.

రంగయ్యగారు, ఆ సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళిపోవాలని నిశ్చయించుకొని భోజనం కాగానే కౌంటర్‌దగ్గరికి వెళ్ళి "అబ్బాయ్! నేను సాయంత్రం గది ఖాళీ చేస్తున్నాను. నా లెక్క చూడు నాయనా! డబ్బు యిచ్చేస్తాను." అన్నాడు.

ఆనందరావు బిల్లులు తిరగేసి, చిత్తు కాగితంమీద కూడి "యింకా ఏడు రూపాయిల ఇరవైఆరు పైసలు యివ్వాలండీ," అన్నాడు.

రంగయ్యగారు ఏడు రూపాయినోట్లు ఒకపావలాబిళ్ళయిచ్చి, "వెళ్ళొస్తాను నాయనా!" అన్నారు.

"మంచిదండీ," అన్నా డానందరావు రూపాయలు లెక్కచూసుకుంటూ.

రంగయ్యగారు సాయంత్రం పెట్టీ, బెడ్డింగూ సర్దుకొని ప్రయాణ మయ్యారు. బోయ్ సామాను టాక్సీడిక్కీలో పెట్టి తల గోక్కుంటూ 'సార్' అన్నాడు.

రంగయ్యగారు లాల్చీజేబులో చెయ్యి పెట్టేసరికి వందరూపాయల కాగితాలు తప్ప చిల్లరకాగితాలు కన్పించలేదు.

కౌంటర్‌దగ్గరికి వెళ్ళి "యీ వందకీ చిల్లరనోట్లియ్ నాయనా!" అన్నాడు రంగయ్యగారు.

ఆనందరావు నోట్లు లెక్కపెడ్తుంటే మీ నాన్నగారితో ఉదయం అన్నివిషయాలు మాట్లాడా" నన్నారు రంగయ్యగారు.

ఆనందరావు తల వూపి "నాన్న, నాకు చెప్పాడు," అన్నాడు.

తొమ్మిది పదిరూపాయిలనోట్లు, తొమ్మిది రూపాయిలనోట్లు, తొమ్మిది పదిపైసల బిళ్ళలు, తొమ్మిది పైసలబిళ్ళలిచ్చి "ఇందాకటి బిల్లులో మీరొక పైస యివ్వలేదు. అది యిప్పుడు తీసుకున్నాను," అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

ఇప్పుడు రంగయ్యగారు ఆనందంతో మూర్ఛపోయాడని మీకు చెప్పను.